క్లుప్తంగా

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న దిలేశ్వరరావు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపంలో లంకమల అడవుల్లో వెలసిన శ్రీనిత్యపూజస్వామి కోనలో ఈ నెల 7వ తేదీ నుంచి జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు కడప ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని కడప ఆర్టీసీ డిపో మేనేజర్ కె. దిలేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సిద్దవటం గ్రామ శివారులో ఉన్న ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భాకరాపేట, పంచలింగాల వద్ద ఆర్టీసీ కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కన్యాకుమారి, ఏడీసీ ఫకృద్దీన్, కె.వి. మల్లికార్జునరావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రెటరీ బాలవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి

ఓబులవారిపల్లె : మండలంలోని 135, 136, 138లో పాటు పలు పోలింగ్ బూత్‌లను ఓవీఆర్‌ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల్లో మరుగుదొడ్లు, మంచినీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, వీఆర్‌ఓ హరి పాల్గొన్నారు.

చేతిరాతకు పదను పెడదాం



చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

సంబేపల్లె : విద్యార్థి కెరీర్‌లో మంచి చేతి రాత చాలా ముఖ్యమని చేతిరాత బాగుంటే మంచి మార్కులు వస్తాయని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ తెలిపారు. అందువల్ల చేతిరాతను మెరుగుపర్చుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని సూచించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నెలరోజుల పాటు చేతిరాతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దిలీప్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేతి రాత నిపుణులు లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో చేతిరాతలో మెళుకవలు, అందంగా రాయడం, కాలిగ్రఫీలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.


అప్పారాజుపేటలో గ్రామ సభ



వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పారాజుపేట సచివాలయంలో మంగళవారం ఎంపీడీఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా చేపట్టిన పేదల ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయాలు ద్వారా వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో ఆధ్యా మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరంలో 150 మంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హర్షిత, గుణసాయి, సుజాత, అభిరామ్, రామాంజనేయులు, ఆధ్యా మేనేజర్ అశోక్ రెడ్డి, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామాలయ అభివృద్ధికి కృషి

రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి



రఘునాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని రఘునాథరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నరేష్ బాబు శాలువా కప్పి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి మేడాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం తాను, తన అన్న రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని మరో భద్రాద్రిగా గుర్తించాలని అప్పట్లోనే కృషి చేశామని గుర్తుచేశారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం సొంత నిధులతో అన్నప్రసాద కార్యాలయాన్ని నిర్మిస్తామని, టీటీడీకి విజ్ఞప్తి చేశామని తెలిపారు. పురావస్తుశాఖ నుంచి అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అంతే కాకుండా ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానని తెలిపారు. నూతన జాతీయ రహదారి నుంచి ఒంటిమిట్ట రామాలయానికి లింక్ రోడ్డు కూడా వచ్చేలా చేస్తానన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో సీతారాముల కల్యాణానికి 120 కిలోల ముత్యాల తలంబ్రాలు తన సొంత నిధులతో ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

పరామర్శ

ఒంటిమిట్టకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటశివారెడ్డి రెండో కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వెంకట శివారెడ్డిని, కుటుంబ సభ్యులను రఘునాథరెడ్డి పరామర్శించారు. అలాగే మండల పరిధిలోని మంటపంపల్లి చెందిన వైస్ ఎంపీపీ గడ్డం జనార్దన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని ఆయన ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రఘురాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేడాను సన్మానించిన ఎద్దుల

నందలూరు (రాజంపేట): రఘునాథరెడ్డిని మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు మంగళవారం ఘనంగా సన్మానించారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ రఘునాథరెడ్డికి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సౌమ్యనాథ స్వామి అన్నదాన ట్రస్ట్‌కు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యోగీశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రాము, సాయినాథ్, వంశీ, సుబ్బరాయుడు, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎంసీఎంసీ కమిటీదే కీలకపాత్ర



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ గుర్రప్ప

రాయచోటి : ఎన్నికల పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషిస్తాయని మాస్టర్ ట్రైనర్ గుర్రప్ప పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీల్లో పనిచేయబోయే అధికారులు, సిబ్బందికి నోడల్ అధికారి ధనలక్ష్మి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లా కో–ఆపరేటివ్ అధికారి గుర్రప్ప మాస్టర్ ట్రైనర్‌గా అన్నమయ్య జిల్లాలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు గరిష్ట పరిమితిని భారతదేశ ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తుందని ట్రైనర్ తెలిపారు. ప్రతి అభ్యర్థి ఖర్చులను వ్యయ పర్యవేక్షణ కమిటీ నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంసీఎంసీ కమిటీ గురించి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాను తమ ప్రచారాలకు వాడుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో మీడియాను పర్యవేక్షించి స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ఎంసీఎంసీ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి నాగరాజు, జిల్లా కో–ఆపరేటివ్ ఆడిటర్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆడిట్ అధికారులు, సమాచార, పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు

ప్రజల వద్దకే ‘జగనన్న ఆరోగ్య సురక్ష’



రోగులకు మందులు అందజేస్తున్న లక్ష్మిరెడ్డి, ఉమామహేశ్వరరావు

సిద్దవటం : ప్రజల వద్దకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ కొంగా జయలక్ష్మి అధ్యక్షతన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలు విరివిగా పాల్గొని వైద్య సేవలు పొందారని తెలిపారు. వైద్య నిపుణులు శైనీషారోన్, రంగలక్ష్మి, జి. శ్రీనివాసులరెడ్డి, రహెమాన్, ఆప్తాలిమిక్ కిరణ్‌బాబు వైద్య సిబ్బంది అన్ని రకాల పరీక్షలు, చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలిపారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 305 మంది రోగులకు వైద్యం అందించామని, 49 మందికి కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు కొంగా లక్ష్మిరెడ్డి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, గ్రామ కార్యదర్శులు సునీత, సంధ్య, పి. కొత్తపల్లి సీహెచ్‌ఓ సూపర్‌వైజర్ రామ్మోహన్, సీహెచ్‌ఓలు సంధ్య, లోకేశ్వరి, జాస్మిన్, వెంకటమ్మ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదిరతరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంబేపల్లె : ప్రతి వ్యక్తికి చదువుతో పాటు ఆర్థిక అక్షరాస్యత అవసరమని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో ఈ ఏడాది 2024 ఫిబ్రవరి 26వ తేది నుంచి మార్చి 1వ వరకు జిల్లా వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు చిన్ననాటి నుండే పొదుపు చేయడం అలవాటు చేయాలని సూచించారు. ఆర్‌బీఐ సూచించే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని పాఠ్యాంశాల్లో చేర్చితే ఆర్థిక జ్ఞానం విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఆదాయానికి మించి ఖర్చు చేయరాదని, పొదుపు చేయగా మిగిలిన డబ్బును మాత్రమే ఖర్చు చేయాలని సూచించారు.

విద్యార్థుల ర్యాలీ

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల మైదానం నుంచి చిత్తూరు–కడప జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనవసర ఖర్చులు తగ్గిద్దాం, ఆర్థిక సాధికారిత సాదిద్దాం, సరదాలకు, షికారులకు అప్పు పెనుముప్పు, మన చేతుల్లో ఇన్‌కమ్ ఉన్నప్పుడే సమాజం మనకు వెల్‌కమ్ చెబుతుంది. విద్యార్థులకు పొదుపు–వారి భవిష్యత్తుకు మలుపు అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మన్సూరు బాష, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వి కవిత, పి సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : రామాపురం మండలంలోని జాతీయ రహదారిపై సెరికల్చర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం సరస్వతిపల్లెకు చెందిన భవాని (32), కృష్ణబాబు (22), వినీత (4) మృతి చెందడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాధితులను ఆయన పరామర్శించి.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి జెడ్పీటీసీ మాసన వెంకటరమణ వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ వెంకట సుబ్బారెడ్డి, సర్పంచులు అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి మునీర్ భాష, పలవల వెంకటరెడ్డి సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి ఆదినారాయణ రెడ్డి కనపర్తి చెన్నారెడ్డి సత్య యాదవ్ చంద్రయ్య యాదవ్ వైస్ ఎంపీపీ రవి శంకర్‌రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రత్యామ్నాయం చూపండి



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె సర్వే నంబర్ 8లో పశువుల మేతకు ప్రత్యామ్నాయం చూపించాలని గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బెరైటీస్ ఆధారిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లె కాలుష్య గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పిస్తున్నారని, అయితే గ్రామానికి సంబంధించిన పశువుల మేతకు భూమి, కాటమదేవుడు ఆలయానికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆర్‌ఆర్–5కు చెందిన నిర్వాసితులకు భూములు, ఇళ్లకు పరిహారం, ప్యాకేజీలు, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, దేవేంద్రనాథ్‌రెడ్డి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

సంబేపల్లె : మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, కార్యాలయాలను బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ నాగ శ్రీలక్ష్మి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మోటగట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, 11 గంటలకు మండల కేంద్రంలో డీకేటీ పట్టాల పంపిణీ, 12.30 గంటలకు నాగిరెడ్డిగారిపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే సముదాయ భవనాలు, దేవపట్లలో ఒంటి గంటకు సచివాలయం, ఆర్‌బీకే, డైరీ యూనిట్లు, 3 గంటలకు మండల కేంద్రంలో వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

రేషన్ డీలర్ల సమావేశం

లక్కిరెడ్డిపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న సివిల్ సప్లై తహసీల్దార్ ఎస్ ఉస్మాన్ సాహెబ్ ఎండీయూ, రేషన్ డీలర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎండీయూలు మార్చి నెల ఒకటో తేదీన ఉదయం 7 గంటల నుంచి ఈ పాస్ మిషన్ ఓపెన్ చేసి సరుకులు ప్రజలకు ఇవ్వాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని, రెన్యూవల్ చేయించుకోవాలని అధికారులు సూచించారు.

‘పల్స్ పోలియో’ను విజయవంతం చేయండి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు



సూచనలిస్తున్న డాక్టర్ శేఖర్

నందలూరు(రాజంపేట) : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలను వేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ కోరారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కమల్ మాట్లాడుతూ మార్చి 3న ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కేంద్రాలకు రాని పిల్లల కోసం 4,5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, ఎంపీడీఓ శేఖర్ నాయక్, ఎంఈఓ అనంతకృష్ణ, సూపర్ వైజర్ సునీతమ్మ, పీహెచ్ ఎన్ శైలజ, సీహెచ్‌ఓ వెంకటనారాయణ, ఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, టీచర్స్, వాలంటీర్లు శిక్షణ ఇచ్చారు.

పుల్లంపేట: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ సానేశేఖర్ కోరారు. మార్చి 3న అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం పుత్తనవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఏఎన్ఎంలకు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాలు లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, నూటికి నూరుశాతం ఈ కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ చంద్ర, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు టీటీడీ కల్యాణ మండపం ప్రారంభం



ప్రారంభానికి ముస్తాబవుతున్న టీటీడీ కల్యాణ మండపం

రాయచోటి : పట్టణంలో రూ.3.8 కోట్లతో టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపాన్ని నిర్మించారు. నేడు (బుధవారం) ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కల్యాణ మండపాన్ని ప్రారంభించనున్నారు. ఎన్నో దశాబ్దాలుగా రాయచోటిలో టీటీడీ కల్యాణమండపాన్ని నిర్మించాలన్న స్థానికుల కళ శ్రీకాంత్‌రెడ్డి కృషితో నెరవేరింది. విశాలమైన మండపంతో పాటు అందరికీ అందుబాటులో ఉండే ధరలతో మండపాన్ని నిర్మించాలన్న స్థానికుల ఆశలకు అనుగుణంగా రాయచోటి–చిత్తూరు మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో 1.65 ఎకరాల్లో మండపాన్ని నిర్మించారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయచోటిలో కల్యాణమండపాన్ని నిర్మించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోరిన వెంటనే ఈ భవనాన్ని వేగంగా నిర్మించారు. ప్రారంభోత్సవంలో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులతో పాటు టీటీడీ అధికారులు కూడా పాల్గొననున్నారు.

బర్డ్ ఫ్లూ వైరస్‌ను నివారిద్దాం



గోపాలమిత్రను అభినందిస్తున్న జేడీ, ఏడీ తదితరులు

చిట్వేలి : ప్రమాదకరమైన బర్డ్ ఫ్లూ వైరస్‌ను నిరోధించడానికి ఉమ్మడి కడప జిల్లా యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుందని పసువైద్యశాఖ జేడీ డాక్టర్ గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. స్థానిక ఏరియా పశువైద్యశాలలో మంగళవారం జరిగిన బర్డ్ ఫ్లూ వైరస్ నిరోధక సంయుక్త సమావేశంలో ఆయన ఉమ్మడి కడప జిల్లా పశువ్యాధుల నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రాణాంతక వైరస్ ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. అన్నమయ్య జిల్లాలో 36 లక్షల కోళ్లను రైతులు పెంచుతున్నారని, వైద్యులు సూచించిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం తప్పుతుందని తెలిపారు. నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, గుడ్లు, దాణను నిషేధించామన్నారు. జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ప్రజలు ఆందోళన చెందకూడదని పేర్కొన్నారు. పశు కిసాన్ కార్డులను అత్యధికంగా సేకరించిన ఆరోగ్యమిత్ర వెంకటసుబ్బయ్యను జేడి గుణశేఖర్ పిళ్లై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పసువైద్యశాల ఏడీ కేడీ వరప్రసాద్, డాక్టర్ భువనేశ్వరి, ఆరోగ్యమిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టుదల అవసరం



విద్యార్థులకు సూచనలిస్తున్న శివప్రకాష్‌రెడ్డి

రాజంపేట రూరల్ : 10వ తరగతి విద్యార్థులు పట్టుదల ఏకాగ్రత అవసరమని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని కేబోయినపల్లి జిల్లా ఉన్నత పాఠశాలను డీఈఓ మంగళవారం సందర్శించారు. 10వ తరగతి విద్యార్థుల విద్యాభ్యాసంపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎల్లప్పుడు లక్ష్యం వైపు మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. మంచి మార్కులు సాధించి మీ విజయాలకు మీరే బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం సీహెచ్‌సీ తనిఖీ



వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న విజయ్‌కుమార్

సిద్దవటం : సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీమ్ ఆఫ్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్‌నాయక్, కన్సల్‌టెంట్ (సీహెచ్‌ఐ) డాక్టర్ విజయ్‌కుమార్ ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న సేవలపై వారు సంతృప్తి చెందారు. ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నారని, ఇలానే వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిజోత్స్న, మత్తు డాక్టర్ శివాణి, జనరల్ సర్జన్ డాక్టర్ సూర్యచంద్ర, ఫిజియోథెపిస్ట్ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కె. రమ్య (డెంటల్), డాక్టర్ మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీవి దిగజారుడు రాజకీయాలు

రాయచోటి : టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మండల జేసీఎస్ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు భాగ్యమ్మ ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించం ఆ పార్టీ నేతలకే చెల్లుతుందని ఎద్దేవాచేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వేర్వేరు ప్రకటనల్లో వారు మాట్లాడుతూ సంబేపల్లె మండలం, దుద్యాల సర్పంచ్ ఎం లక్ష్మీదేవి టీడీపీ తరపున గెలిచారని తెలిపారు. అయితే ఎన్నికల సమయంలో రాజకీయ ప్రచారం కోసం వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరారని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. రాజకీయంగా ప్రచారం చేసుకోవడానికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తప్పుడు ప్రచారాలు చేసుకోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. శ్రీకాంత్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు టీడీపీ నాయకులు దిగడం దారుణమన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

రాజంపేట రూరల్ : ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ప్రలోభాలకు గురికాకుండా యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని విశ్రాంత జడ్జి రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కడపకు చెందిన నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు నిఖిల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఓటు హక్కు బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సుబ్బనరసయ్య, చాన్‌బాష, కేవీ రమణ, రవీంద్రబాబు, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన విజయదుర్గ బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ వద్ద గల విజయ దుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అందులో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బలిహరణం, యాగశాలలో చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత అవభృద స్నపనం, శిఖర ప్రోక్షణ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య ఉత్సవాల ముగింపు సూచికంగా సింహ చిహ్నం గల పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. సంతాన ప్రాప్తి కోసం ధ్వజావరోహణం సందర్భంగా నిర్వాహకులు మహిళలకు కొడిముద్దలు పంపిణీ చేశారు. అమ్మవారి మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ అమ్మవారి త్రిశూలాన్ని ఆలయ ప్రాంగణంలోని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ ఆయన వేద పండితులతో కలిసి త్రిశూల స్నానం చేయించారు. మంగళవారం కావడంతో రాహుకాల పూజలు జరిపారు.

రైతులకు న్యాయం చేయకుంటే హైవే పనుల అడ్డగింపు

మదనపల్లె : మదనపల్లె–తిరుపతి ఫోర్‌లేన్ నిర్మాణంలో, కొత్తవారిపల్లె పంచాయతీ పాలెంకొండ వద్ద రైతులకు అనువుగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని, లేనిపక్షంలో హైవే పనులను అడ్డుకుంటామని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు హెచ్చరించారు. కొత్తవారిపల్లి పంచాయతీ పాలెంకొండ గ్రామంలో రైతు సంఘం నాయకుడు కృష్ణమూర్తి అధ్యక్షతన రైతు సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు మాట్లాడుతూ బెంగళూరు తిరుపతి హైవే నిర్మాణ పనుల్లో భాగంగా కొత్త వారి పల్లి పంచాయతీ గ్రామ రైతులకు ఏర్పాటు చేయవలసిన అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయనందువల్ల రైతులకు అనేక రకాల నష్టాలు జరుగుతున్నది, రైతులు వ్యవసాయం చేసుకోవాలన్న సిటిఎం చెరువు వద్దకు తమ సాగు పనులు చేసుకోవాలన్న ,హైవే రోడ్డు క్రింద బ్రిడ్జిలు నిర్మాణం జరగనందువల్ల గ్రామస్తులు తమ పొలాలకు వెళ్ళలేకపోతున్నారన్నారు. రైతులు వ్యవసాయం చేసుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయమై అనేకసార్లు జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులకు తెలియజేసిన ప్రయోజనం లేదన్నారు. దీంతో విధిలేక హైవే రోడ్డు పనులను అడ్డుకోవాల్సి వస్తోందన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, రైతు సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, తిరుమల, రైతు నాయకులు రమణ హరి తదితరులు పాల్గొన్నారు.